# లోభివాడు—హరికథ

శ్రీమతి బులుసు లక్ష్మీనరసమ్మగారు

(ఒక వినోదకథ)

అనగా అనగా వో వూళ్లో ఒక బ్రాహ్మడు వుండేవాడు. వానికి దిట్టంగా డబ్బుంది. కాని పరమలోభి. దమ్మిడీ మోహర్లాగు చూస్తూండేవాడు. పిత్రార్జితధనం కొంచెమొచ్చినను దాన్ని వొడ్డీవ్యాపారం చేత వొక లకారాని కిచేసేడు. వొక బోషాణంపెట్టి వాడింట్లో చిరకాలమునుండి వుండేది. తనసొత్తుయావత్తు ఆ బోషాణంలోపెట్టి బీగము వేసి దానిమీద వోకుచ్చెళ్లబొంతపరచి రాత్రిపగలు దాన్ని విడవకుండ పడుకునేవాడు. పాపం యింతడబ్బున్న మంచితిండెరుగడు. శుభ్రమైన బట్టఎఱుగడు. అతనియిల్లాలు గుణవంతురాలు, పతివ్రత. ఆమెకు పతిసేవ, దైవభక్తి మెండు. అలాంటి భర్తదగ్గర ఆ యిల్లాలుకనక పురాణాది కాలక్షేపాలుచేస్తూ కాపరంచేస్తుండేది. వాడిదగ్గర మరోఇలాంటాలాంటిది కాలక్షేపముచేయడం చాలా కష్టము.

ఇలాఉంటూండగా నవరాత్రులువచ్చేయి. ఆ వూళ్లోని ఆ నవరాత్రుళ్లు ప్రతిసంవత్సరం చందాలువేసి చేస్తూండేవారు. అలాగు చేయడమేకాకుండా వొకహరికథా కాలక్షేపముకూడా మామ్మూలు. మామ్మూలుప్రకారం హరిదాసులువచ్చేరు. వూళ్లోచందాలుకు బయలుదేరి డబ్బు వసూలుచేసేరు. మన కథానాయకుడగు లోభాగ్రేసరుణ్ణి అడగడం మామ్మోలులేదు. వాడివ్వడం మామ్మోలులేదు. ఎవరుచందా అడిగినా మహాత్ముడు లాకేత్వంచెప్పటమే మామ్మోలు. ఎవ్వరికి ఎట్టినియోగా నేనాఇచ్చిన పాపాన్నిపోలేదు.

రాత్రి 9 గంటలవేళయినది. హరికథామందిరమంతా అలంకరించేరు, దాసుగారు గజ్జకట్టుకొని, తాళమేళాలికి శృతిచూసుకుంటూన్నారు. హరికథామందిరం ఇసక వేస్తే రాలనంతమందితో నిండిపోయింది. తాళమేళాలుచప్పుడువిని మనగృహస్తుని భార్యయగు మహాభక్తురాలిహృదయం భక్తిపరవశమై భర్తనుచూసి యిట్లు చెప్పడానికిప్రారంభించినది. "ఏమండీ! రామా లేదు; కృష్ణా లేదు; హరికథలేదు; గిరికథలేదు; ఇంట్లోన్నమట్టుకు తింటూండం; బోషాణమీద పడుకుంటూండడం; దీనివలన ఇహమా? పరమా? డబ్బుశాశ్వతమనుకొన్నారా? ఈతుచ్ఛశరీరము రేపోనేడో పోవలసినదే. అంచేత హరికథకువెళ్లి, రెండుముక్కలువిని నాకుచెప్పండి. దానివల్లఇహం, పరంవుంది. మీరుచెప్తే వినేసా సంతోషిస్తాను" ఈలాగ అనేకమార్లు చెప్పగా, చెప్పగావిధిలేక హరికథకివెళ్ల నిచ్చియించికొన్నాడు. కాని వెళ్లడానికిమాత్ర మిష్టంలేదు. ఇరుగుపొరుగులవాళ్లకి, ఊళ్లోవాళ్లకి వీడినిచూస్తే మహాకోపం. వీడెప్పుడిల్లుకదులుతాడు వీడిధనం ఎప్పుడు వుడాయించేద్దాం అని ఎదురుచూస్తుండేవారు. బాబుగారు హరికథకివెళుతూండగాచూసేరు. ఇంట్లోవున్నలొడ్డులొసుగు యావత్తు ఎగేసేద్దామని కాచికూర్చున్నారు.

హరికథలోకొచ్చేడు. వీడినిచూసి భాగ్యవంతుడని అంతా తోవ తొలిగేరు. మెల్లిగా దాసుగారి సమీపం లోకి వెళ్లినాడు. దాసుగారు వీడినిచూసి పొంగవేసి డబ్బులాగుదామని, ఆయనమీద కన్ను వేసినాడు. చూసి "అయ్యా! వచ్చేరా?" అని అన్నాడు. అప్పుడు బ్రాహ్మడికి వొంట్లోకుదుపుట్టి, అన్నా! నేరకొచ్చే నురా హరికథకిఅని అనుకోని కూర్చున్నాడు. హరిదాసుగారుచూసి "కూర్చున్నారా?" అనిఅడిగేడు. అంత బ్రాహ్మడుమనస్సులో "వీడిదుంపతెగ పిశాచంలాగుపట్టుకొన్నాడు. ఎలాగేనాబూటకాలాడి డబ్బులాగేదా మని వాడిఉద్దేశము" అని అనుకొని గబగబ పుంజాలుతెంచుకొని యింటికిపరుగెత్తడం మొదలెట్టేడు. లోభికి డబ్బే ప్రాణం గదా? యింట్లోలొడ్డులోనుగు యేవత్తు ఎవరేనా వుడాయించేస్తారని మనస్సులో భయంచేత అన్నారు. పరుగెత్తుతున్నాడు. అప్పుడుహరిదాసుగారు"ఏమండోయి! వెళ్లిపోతున్నారా?"అనిఅన్నాడు. వాడికి హరిదాసుగారిమాట లక్ష్యమా? మెల్లిగా యింటికిచేరి తలుపుబాదినాడు. అంతభార్య తలుపుతీసి అప్పుడే హరికథఅయిపోయినదండీ? అనిఅడిగింది. ఆ ! ! ! అయింది. వాడిమొగంకథ, నీమొగంకథాను. హరిదాసు సంసారంగాదు. వొచ్చిందిమొదలు వొకటేపాట. ఎలాగేనాడబ్బు లాగేద్దామని ముఖస్తుతులు ప్రారంభించేడు. అప్పుడు భార్య భర్తనుచూచి ఏమిటి జరిగిందోచెప్పుదురు సంతోషిస్తాను అని అడిగింది.

అంత బ్రాహ్మడు హరికథలో జరిగినభోగట్టా ఇట్లుచెప్పడానికి ఆరంభించేడు. నేను హరికథామందిరం లోకి వెళ్లేసరికి "వచ్చేరా?" అన్నాడు. హరిదాసు అన్న 'వచ్చేరా? శబ్దము ఇతడు గట్టిగా చేప్పేడు. అంతలో వీడికొంపంతా దోచేద్దామని పెరటిద్వారంతవ్వుతూన్న ఇరుగుపొరుగుదొంగలు, బ్రాహ్మడుచెప్పిన "వచ్చేరా?" అన్నశబ్దంవిన్నారు. విని "వీడి దుంపతెగా మనంరావడం ఎలాతెలుసుకున్నాడ్రా?" అని వాడి పెరట్లోవున్న నిమ్మచెట్టుక్రిందకు పారిపోయి కూర్చున్నారు. అప్పుడు బ్రాహ్మడుభార్య తరువాతేమిటిజరిగిం దండీ? అన్నాది. మరేమి వాడిమొగం నేనుకూర్చుండడంచూచి "కూర్చున్నారా?" అని పారంభించేడు అని వొత్తిపలికేడు. పెరట్లోదొంగలు అదికూడావిని "వీడినెత్తికొట్టా కూర్చోడంకూడా చూచేడ్రా" అని సన్నసన్నగా కాళ్లకు బుద్ధిచెప్పే ప్రయత్నంలోకి దిగేరు. తరవాతేం జరిగిందని భార్యఅడగింది. మరేమి టంటా వేమిటె బ్రతకనిచ్చేడుకాడు. నేనుబయలుదేరడంచూచేడు. "వెళ్లిపోతున్నారా?" అనిప్రారంభించేడు అనిచెప్పుతూ హరిదాసు పలుకులు ఒత్తిపలికేడు. నాకసహ్యంవేసింది. పారిపోచ్చేను. అనిన్నీచెప్పినాడు. అప్పుడుదొంగలు "పిశాచంముండాకొడుకు మనంపరిగెత్తిపోనడంకూడా చూచేడ్రా! ఇకమన ఆబోలుదక్కదు. వాడు పోలీసు కచేరీకిపోయి మనమీద నోటికొచ్చినట్టుకూస్తాడు, మనకొంపముంచేస్తాడు. కనుక మనదగ్గిర ప్రస్తుతంవున్న మూడువందలరూపాయలు వాడిమొగంమీదజల్లి బ్రతిమ్మాలుకుందాంరార్రా?" అని ఇరుగు పొరుగుదొంగలు వాడికొంపమీదపడి వాణ్ణిపిలిచి ఆడబ్బుఇచ్చుకు కాళ్లమీదబడ్డారు. బ్రాహ్మడికి యీగోల తెలియదు. ఆ మూడువందలు అందుకొని తలుపులు బిడాయించేసేడు.

అప్పుడు భార్య, "చూచేరా? హరిదాసునోటంట వచ్చిన మూడుమాటలు వింటేనే మూడువందలు లాభంకలిగింది. అతడుచెప్పిన కథంతావింటే ఎంతలాభము వచ్చునోకదా?" అనిచెప్పెను. అదిమొదలు ఆ బ్రాహ్మడు తరుచుగా హరికథలకు వెళుతూ ఔదార్యముకలవాడై అంత్యమున విష్ణుసాయుజ్యము నొందేడు.